యోగాతో ఆరోగ్య భాగ్యం

- దీర్ఘకాలిక రోగాలకు దివ్యఔషధం
- అంతర్జాతీయ యోగా దినోత్సవంలో వక్తలు
- యోగాసనాలు సాధన చేసిన యోగాభ్యాసకులు





స్టేడియంలో యోగాసనాలు చేసి చూపిస్తున్న యోగా విద్యార్థులు, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీ బి.నాగరాజు

కర్నూలు కల్చరల్: యోగాతో మనసు ప్రశాంతంగా ఉండి సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని యోగ గురువులు, వక్తలు పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని కర్నూలు నగరంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాలు, యోగా శిక్షణ కేంద్రాలు, విద్యా సంస్థల్లో జరిగిన కార్యక్రమాల్లో యోగా గురువులు యోగాసనాలు సాధన చేయించారు. యోగాభ్యాసకులు ఆసనాలను ప్రదర్శించారు. దీర్ఘకాలిక రోగాల నివారణకు యోగ దివ్య ఔషధమని, యోగ ద్వారా ఒత్తిడిని అధిగమించి శారీరకంగా మానసికంగా ఉత్సాహంగా ఉంటామని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు.

☛ రాయలసీమ విశ్వవిద్యాలయంలో వర్సిటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన యోగావేడుకల్లో ఆర్‌యూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బి. సుధీర్ ప్రేమ్ కుమార్ అతిథిగా పాల్గొని మాట్లాడారు. దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకుంటే ఏ విధమైన ఆరోగ్య సమస్యలు, మానసిక ఆందోళనలు దరిచేర వన్నారు. 'మహిళా సాధికారత కోసం యోగ' అనే నినాదంతో ఈ సంవత్సరం విశ్వవ్యాప్తంగా యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు వివరించారు. వివేకానంద కేంద్ర బాధ్యులు వక్తగా హాజరై మాట్లాడారు. యోగా శిక్షకురాలు ఉషారాణి, యోగా డెమాన్‌స్ట్రేటర్ శ్రీనివాసులు యోగా సాధన చేయించారు. వర్సిటీ డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య పి.వి. సుందరానంద్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై. హరిప్రసాద్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.నాగరాజు, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ వెంకటరత్నం, డాక్టర్ విజయుడు, శివప్రసాద్‌రెడ్డి, డాక్టర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

☛ డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో జరిగిన యోగా వేడుకల్లో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాస్ పాల్గొని ప్రసంగించారు. యోగ భారత దేశ ప్రాచీన సంప్రదాయానికి అమూల్యమైన బహుమతి అన్నారు. అనంతరం యోగాసనాలు సాధన చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జహనారా, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ బి.వెంకటప్ప, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ పాల్ కృపాకర్, తదితరులు పాల్గొన్నారు.

☛ శ్రీ పతంజలి సాయినాథ్ యోగా శిక్షణ కేంద్రం, భారత్ వికాస్ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో వీఆర్ కాలనీలో వేడుకలు జరిగాయి. యోగా గురువు పెరుమాళ్ల దత్తయ్య, కార్యదర్శి రేగూరు బాలకృష్ణ, సభ్యులు రంగస్వామి, కేశవరావు, బాల సుబ్రహ్మణ్యం, రాఘవేంద్రప్రసాద్, భ్రమరాంబ, రాధ తదితరులు పాల్గొన్నారు.

☛ సత్య సాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నెహ్రూనగర్‌లోని సాయి మందిరంలో యోగా గురువు శ్రీనివాస్ యోగాసనాలు సాధన చేయించారు. సంస్థ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సభ్యులు సంధ్య, మాలతి, రజిత, తదితరులు పాల్గొన్నారు.

☛ నగర శివారులోని విజ్ఞాన పీఠం ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో జిల్లా కుటుంబ ప్రబోధన్ కార్యకర్త రాం ప్రసాద్ సురేష్ యోగ ప్రాధాన్యతను వివరించారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు రామిరెడ్డి, ఉపాధ్యాయులు సుదర్శన్‌రావు, స్వర్ణలత, చంద్ర మోహన్, రణధీర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, సోమయ్య, వంశీ రాఘవయ్య, హిమాయత్, రేణుకా, రాజశేఖర్‌రెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

☛ తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నగర శివారులోని ఇండస్ పాఠశాలలో యోగా వేడుకలు జరిగాయి. విశ్రాంత కలెక్టర్ నంది వెలుగు ముక్తేశ్వరరావు అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో విద్యా సంస్థల అధినేత కె.వి.రాజశేఖర్, గాయిని రాజశేఖర్, ప్రధానోపాధ్యాయురాలు మీనాక్షి విల్సన్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో..

కర్నూలు సిటీ: నగరంలోని వివిధ పాఠశాలలు, కాలేజీల్లో శుక్రవారం అంతర్జాతీయ యోగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక మైనర్ కాలేజీలో జరిగిన వేడుకల్లో ఆ కాలేజీ ప్రిన్సిపాల్ రవి కుమార్ రెడ్డి, ఎన్.ఎస్.ఎస్ కో-ఆర్డినేటర్, వైస్ ప్రిన్సిపాల్ కె.సురేష్ పాల్గొన్నారు.

☛ నగర శివారులోని జి.పుల్లయ్య, రవీంద్ర మహిళా ఇంజనీరింగ్ కాలేజీల్లో జరిగిన వేడుకల్లో ఆ కాలేజీల ప్రిన్సిపాల్స్ డా.సి శ్రీనివాసరావు, డా.కె.ఇ శ్రీనివాస మూర్తి, ఆచార్య శశికుమార్ డీన్, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.శంకర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

☛ బీ క్యాంపులోని ప్రభుత్వ వొకేషనల్ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్, అధ్యాపకులు పాల్గొని విద్యార్థులతో యోగాసనాలు వేయించారు.

☛ కేశవరెడ్డి విద్యా సంస్థల్లో జరిగిన యోగ కార్యక్రమాలో ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు యోగ ప్రాధాన్యతను వివరించారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

కర్నూలు(హాస్పిటల్): యోగాభ్యసన చేయడం ద్వారా మానసిక ఒత్తిడికి దూరంగా ఉండవచ్చని, తద్వారా వైద్య విద్యలో ఉత్తమ ఫలితాలు వస్తాయని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కర్నూలు మెడికల్ కాలేజీలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైద్య విద్య నిరంతరం ఛాలెంజింగ్‌గా ఉంటుందని, కావున విద్యార్థులు ప్రతిరోజూ యోగా ఆచరించడం మంచిదని, మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవడం ద్వారా విద్యతో పాటు తమ దైనందిక కార్యక్రమాల్లో కూడా మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. అనంతరం ఈషా ఫౌండేషన్ సహకారంతో యోగా గురువులు వశిష్ట, భార్గవి, శిరీష ఆధ్వర్యంలో వైద్య విద్యార్థులతో యోగా చేయించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్, డాక్టర్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ, డాక్టర్ శ్యామ్‌సుందర్, డాక్టర్ సోమశేఖర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ప్రవీణ, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ ప్రకాష్, సురేష్, పర్ల సిబ్బంది షణ్ముకుడు, సాయిరామ్, మాధవరాజు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో...

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక వడ్డేగేరి యూపీహెచ్‌సీలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ మీ కోసం, సమాజం కోసం యోగా అనే నేపథ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీపీఎంఓ డాక్టర్ ఉమా, డీపీఓ విజయరాజు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకట ప్రవీణ్, ఎర్రబురుజు వైద్యాధికారి డాక్టర్ ముషాహిద్ చౌదరి, డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబిలైజర్ ప్రసాద్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చందన పాల్గొన్నారు.

శ్రీ పతంజలి కాశీ విశ్వనాథ్ యోగా కేంద్రం ఆధ్వర్యంలో...

స్థానిక కిడ్స్‌వరల్డ్‌లో శుక్రవారం శ్రీ పతంజలి కాశీ విశ్వనాథ్ యోగా కేంద్రం ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువు కాశీ విశ్వనాథ్ మాట్లాడుతూ నిత్యం యోగా వల్ల శారీరక, మానసిక రుగ్మతలు తొలగిపోతాయని చెప్పారు. కార్యక్రమంలో యోగా సభ్యులు పురుషోత్తమ్, బలరామ్, విశ్వనాథ్, మన్మథరావు, శివాజీరెడ్డి, సుధాకర్, రవి, శ్రీవాణి, మీరా, సరస్వతి, స్వాతి, సునంద, సుగుణ, ఉమా పాల్గొన్నారు.

దంత వైద్యుల ఆధ్వర్యంలో...

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక ఓ హోటల్‌లో యోగా తరగతులు నిర్వహించారు. యోగా శిక్షకులు రామచంద్రయ్య ఆధ్వర్యంలో యోగా క్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో దంత వైద్యుల సంఘం రాయలసీమ బ్రాంచ్ సెక్రటరీ డాక్టర్ రాయపు రామచంద్రారెడ్డి, డాక్టర్ వై. మురళీధర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ డాక్టర్ నరేష్, డాక్టర్ సందీప్, డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, డాక్టర్ సతీష్, డాక్టర్ నేహా, డాక్టర్ శ్రావణి పాల్గొన్నారు.

మెడికవర్‌లో..

కర్నూలు మెడికవర్ హాస్పిటల్‌లో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా యోగా గురువు శేషఫణి హాజరై యోగా వల్ల కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు. యోగాతో శారీరక, మానసిక ప్రయోజనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ క్లస్టర్ హెడ్ మహేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



అతిథిని సన్మానిస్తున్న రాయలసీమ యూనివర్సిటీ వీసీ, ఆచార్యులు



ఇండస్ పాఠశాలలో సూర్యనమస్కారాలు చేస్తున్న విద్యార్థులు



ఇండస్ పాఠశాలలో నృత్యం ప్రదర్శిస్తున్న విద్యార్థులు



సత్యసాయి సేవా ట్రస్ట్ సభ్యుల యోగాసనాల సాధన



ఉర్దూ విశ్వవిద్యాలయంలో యోగాసనాలు సాధన చేస్తున్న దృశ్యం

అమృత్ సరోవర్ చెరువుల్లో..



ఉల్లిందకొండ చెరువులో యోగా చేస్తున్న పీడీ

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని అన్ని మండలాల్లో అమృత్ సరోవర్‌లుగా అభివృద్ధి చేసిన చెరువుల్లో ప్రపంచ యోగ దినోత్సవ కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించారు. జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ నాయకులు, ఉపాధి కూలీలు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. యోగ కోసం చెరువు ప్రాంతాలను అందంగా తీర్చిదిద్దారు. జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి కల్లూరు మండలం ఉల్లిందకొండ గ్రామంలో అమృత్ సరోవర్‌గా అభివృద్ధి చేసిన చెరువులో నిర్వహించిన యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. యోగా చేయడం వల్ల కలిగే ఉపయోగాలపై ఆయన గ్రామస్తులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులతో ఆసనాలు కూడా చేయించారు.



రవీంద్ర మహిళా ఇంజనీరింగ్ కాలేజీలో యోగాసనాలు వేసిన విద్యార్థులు



కర్నూలు మెడికల్ కాలేజీలో యోగా అభ్యసిస్తున్న వైద్య విద్యార్థులు

క్లుప్తంగా

రేపు సుందరయ్య భవన్‌లో ఉచిత వైద్య శిబిరం

కర్నూలు(సెంట్రల్): సుందరయ్య స్ఫూర్తి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సుందరయ్య భవన్‌లో ఆదివారం ఉదయం 11 గంటలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు చైర్మన్ ప్రభాకరరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ఫిట్స్, బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు కేవలం రూ.200కే రెండు నెలలకు సరిపడ్డా మందులు అందజేస్తామని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రభుత్వ శాఖల్లో ఖాళీలపై శ్వేత పత్రం విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, కారుమంచి డిమాండ్ చేశారు. శుక్రవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన కర్నూలు నగర ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన నేపథ్యంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగాలు భర్తీ చేసే సమయం వరకు నిరుద్యోగులకు ఆసరా కోసం రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. గ్రూపు పోస్టులు, 2024 డీఎస్సీ పోస్టులు, ఎస్ఐ, పోలీసు ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బీసన్న, నాగేశ్వరరావు, సురేంద్ర యాదవ్, శివ కుమార్, చంటి, రాజశేఖర్ పాల్గొన్నారు.

నేడు శ్రీ జగన్నాథ స్వామి స్నాన యాత్ర మహోత్సవం

కర్నూలు కల్చరల్: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో శనివారం ఉదయం 10 గంటలకు శ్రీ జగన్నాథ స్వామి స్నాన యాత్ర మహోత్సవం జరుగుతుందని ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు తెలిపారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

డీజీపీతో బీటీ నాయుడు భేటీ

కర్నూలు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా బాధ్యతలు చేపట్టిన ద్వారకా తిరుమల రావుతో శాసనమండలి సభ్యులు బీటీ నాయుడు భేటీ అయ్యారు. గురువారం పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.తిరుమల రావు భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.

మాతృమూర్తులకు సావిత్రి ఆదర్శం


కర్నూలు కల్చరల్: విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం జేష్ఠ శుద్ధ పాడ్యమిని పురస్కరించుకొని శరీన్ నగర్‌లోని సద్గురు త్యాగరాజ సీతారామాలయంలో మహాపతివ్రత సావిత్రి దేవి వ్రతం నిర్వహించారు. సావిత్రి కథా శ్రవణం జరిగింది. వీహెచ్‌పీ నగర మాతృ శక్తి కన్వీనర్ పావని మాట్లాడుతూ మాతృమూర్తులందరికీ పతివ్రతా శిరోమణి సావిత్రి ఆదర్శమన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు భాను ప్రకాష్, మాతృశక్తి కన్వీనర్ లావణ్య, దుర్గావాహినికన్వీనర్ రాజేశ్వరి,సభ్యులు పాల్గొన్నారు.

ఒలింపిక్ టీ షర్టు లోగో ఆవిష్కరణ



కర్నూలు (టౌన్) : ఈనెల 23న నగరంలో నిర్వహిస్తున్న ఒలింపిక్ డే పరుగుకు సంబంధించిన ఒలింపిక్ టీ షర్టు లోగోను శుక్రవారం ఆవిష్కరించారు. స్థానిక మౌర్య ఇన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ మాట్లాడుతూ ఒలింపిక్ డే లో క్రీడాకారులు విరివిగా పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు,క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్కై మార్షల్ ఆర్ట్స్ పోటీలు



స్కై మార్షల్ ఆర్ట్స్‌లో పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

కర్నూలు (టౌన్) : మార్షల్ ఆర్ట్స్‌లో భాగమే స్కై మార్షల్ ఆర్ట్స్ అని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. శుక్రవారం స్థానిక కోల్స్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో స్కై మార్షల్ ఆర్ట్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ స్కై మార్షల్‌ఆర్ట్స్ క్రీడకు ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ గుర్తింపు ఉందన్నారు. ఒలింపిక్ డేను పురస్కరించుకుని ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా స్కై మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి నబీ సాహెబ్ పాల్గొన్నారు.

బోధనేతర యాప్‌లను రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: బోధనేతర యాప్‌లను రద్దు చేసి పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేయాలని ఎస్టీయూ రాష్ట్ర సహా అధ్యక్షులు సి.నాగరాజు కోరారు. ఈ మేరకు శుక్రవారం నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలల్లో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ వీరచంద్ర యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని తప్పుదోవ పట్టించే జీఓ నంబర్ 117ను రద్దు చేయాలన్నారు. ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదవ తరగతి, ప్లస్ టూ వరకు ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఎస్టీయు పట్టణ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు రవి, భీమరాజు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలన్నారు. ఉపాధ్యాయులను కేవలం బోధనకు మాత్రమే పరిమితం చేయాలని ఇతర పనులు అప్పగించరాదన్నారు. ఎస్టీయూ నాయకులు లోక్యనాయక్, రామయ్య, ప్రహ్లాద్, సుధాకర్ బాబు, భాస్కరాచారి,, నాగేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రికి ఈసీజీ మిషన్ విరాళం



చిన్నపిల్లల విభాగం ప్రొఫెసర్ డాక్టర్ శారదకు ఈసీజీ మిషన్ అందజేస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్):కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు ప్రవాస భారతీయ వైద్యుడు డాక్టర్ రామ్మోహన్ కొప్పర్తి ఈసీజీ మిషన్‌ను విరాళంగా అందజేశారు. ఆయన అమెరికాలోని చికాగోలో నియోనెటాలజిస్టుగా పనిచేస్తున్నారు. ఇటీవల ఓ బాలుడికి గుండెజబ్బు రావడంతో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని చిన్నపిల్లల విభాగానికి తీసుకెళ్లారు. ఆ సమయంలో ఆ విభాగంలో ఈసీజీ మిషన్ లేకపోవడంతో క్యాజువాలిటీ వద్ద ఉన్న రెండో నెంబర్‌లో ఉన్న ఈసీజీ మిషన్ వద్దకు వెళ్లాల్సి వచ్చింది. అక్కడికి వెళ్లి రావడంలో ఆలస్యం జరగడంతో ఆ బాలునికి ప్రాణాపాయం ఏర్పడింది. ఈ సమస్య మరో చిన్నారికి రాకూడదనే ఉద్దేశంతో చిన్నపిల్లల విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీలత ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు పరిస్థితిని వివరిస్తూ చిన్నపిల్లల విభాగంలో ఈసీజీ మిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి అమెరికాలోని తన స్నేహితుడు డాక్టర్ రామ్మోహన్ కొప్పర్తికి విషయం చెప్పి ఈసీజీ మిషన్‌ను విరాళంగా ఇప్పించారు. ఈ మిషన్‌ను శుక్రవారం చిన్నపిల్లల విభాగం ప్రొఫెసర్ డాక్టర్ శారదకు అందజేశారు. అనంతరం డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలో కొత్త ఏఎంసీ విభాగానికి అవసరమైన 12 ఈసీజీ మానిటర్లు (రూ.12లక్షలు)ను కేఎంసీ 1964 బ్యాచ్‌కు చెందిన డాక్టర్ రంగారెడ్డి విరాళంగా అందజేయనున్నారని తెలిపారు. నూతన క్యాజువాలిటీకి 20 పడకలు, మరమ్మతులకు డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి విరాళం ఇచ్చేందుకు అంగీకరించారని తెలిపారు.



డాక్టర్ రామ్మోహన్ కొప్పర్తి

27న మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మహాసభలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

కర్నూలు(హాస్పిటల్): ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ 18వ రాష్ట్ర మహాసభలు ఈ నెల 27వ తేదీన గుంటూరులో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం కర్నూలు శాఖ అధ్యక్షుడు బాలునాయక్ చెప్పారు. ఈ మేరకు కరపత్రాలను యూనియన్ కార్యాలయం వద్ద శుక్రవారం ఆవిష్కరించారు. మహాసభలను ఉద్యోగులు విజయవంతం చేయాలని బాలునాయక్ కోరారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు అబ్రహామ్, సెక్రటరీ ఖాజామొద్దీన్, ట్రెజరర్ సురేష్, నాయకులు హరిచంద్రనాయుడు, శేషిరెడ్డి, రమేష్, నరసింహులు, మల్లికార్జున, ఉరుకుందయ్య, శ్రీనివాసులు, రంజిత్, రాజు, సుశీలమ్మ, భాగ్యమ్మ, గీతా కళ్యాణి, జయలక్ష్మి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కర్నూలు (అగ్రికల్చర్): విద్యుత్ లైన్లు, సబ్ స్టేషన్ల మెయింటెనెన్స్ పనులు శనివారం చేపడుతున్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏడీఈ రాజేంద్రబాబు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు. మారుతీ మెగా సిటీ, బద్రీనాథ్ నగర్, పోస్టల్ కాలనీ, ధనలక్ష్మీ నగర్, నంద్యాల చెక్‌పోస్టు, శరీన్‌నగర్, అబ్బాస్ నగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, రామచంద్రానగర్, ఉద్యోగ నగర్, సాయినాథ్ నగర్, శ్రీరాం నగర్, శారదా నగర్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రెండో ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణంపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డి.గౌస్‌దేశాయ్

కర్నూలు(సెంట్రల్): నగరంలో తాగునీటి ఎద్దడి నెలకొనకుండా రెండో ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణంపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ పార్టీ కార్యాలయంలో కర్నూలు న్యూసిటీ సమావేశం సీహెచ్ సాయిబాబా అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాణ్యం వార్డులకు మూడు రోజులకోసారి మంచినీరు సరఫరా అవుతోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీసభ్యురాలు పి.నిర్మల, నాయులు టి.రాముడు, సుధాకరప్ప, ఆర్. నరసింహులు, కె.ప్రభాకర్ పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులను సీజ్ చేయాలి



ఎంవీఐ సిసిరాదీప్తికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్: ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులను నడుపుతున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) సిసిరాదీప్తికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు గౌస్, శ్రీనివాసులు మాట్లాడుతూ..ఆదోని డివిజన్‌వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫిట్‌నెస్ లేని స్కూలు బస్సులను నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయని ఆరోపించారు. పరిమితికి మించి విద్యార్థులను బస్సుల్లో తరలిస్తున్నారన్నారు. నిబంధనలు అతిక్రమించిన యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రతి స్కూల్ బస్సుకు డ్రైవర్‌తో పాటు క్లీనర్ కూడా ఏర్పాటు చేయాలన్నారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు మోహన్, యశ్వంత్, సూరి, రాజు పాల్గొన్నారు.

బాలల పరిశీలన గృహం తనిఖీ



బాలల పరిశీలన గృహంలో అధికారులతో మాట్లాడుతున్న జడ్జి బి.ఎల్.వి.శేషాద్రి

కర్నూలు (లీగల్) : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి శుక్రవారం పట్టణంలోని బాలల పరిశీలన గృహం, వన్‌స్టాప్ సెంటర్‌ను తనిఖీ చేశారు. కార్యాలయాలకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించి అక్కడ ఉన్న ప్రజలకు, మహిళలకు అవగాహన సదస్సులు నిర్వహించారు. బాలలకు సంబంధించిన చట్టాలు, ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. మహిళలు, పిల్లలు లీగల్ సర్వీసెస్ యాక్ట్ 1987 ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందేందుకు అర్హులని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటలక్ష్మమ్మ, న్యాయవాది బి.లక్ష్మీనారాయణ, ప్రభుత్వ బాలుర పరిశీలన గృహం సూపరింటెండెంట్ ఎం.హుసేన్ బాషా, సుధ పారా లీగల్ వలంటీర్, ఆయా సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక పీఆర్‌ఓగా నయాబ్ మహబూబ్ బాషా

కర్నూలు (టౌన్): నగరపాలక పీఆర్‌ఓగా నయాబ్ మహబూబ్ బాషా నియమితులయ్యారు. ఈయన మేయర్ క్యాంపు ఆఫీసులో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా (అప్‌కాస్) పనిచేస్తున్నారు. అక్కడి నుంచి నగరపాలక పీఆర్‌ఓగా నియమిస్తూ నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో వార్డు ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ కార్యదర్శిగా పనిచేస్తున్న కె. శ్రీకాంత్‌ను తిరిగి గనీగల్లీలో ఉన్న 8 వ సచివాలయానికి బదిలీ చేశారు.

